కథా నిలయం
5081
శ్రీకాకుళం

# ఊరు పిలిచింది

"ఈ ప్రయాణాలంటేనే విసుగు ... ఇప్పుడే ఇంత ఘోరంగా ఉంటే వాల్తేరు నుంచి ఎలా ఉంటుందో .... అసలు ఈ వెధవ రైళ్లు ఎప్పుడూ లేటే ... ప్రయాణమంటే ప్రాణాంతకమే ...."

ఇల్లు బయలుదేరింది మొదలు శ్రీదేవి గొణుగుతూనే ఉంది. అయినా రమణయ్య పట్టించుకోడంలేదు. అతని ఆలోచనలో అతనున్నాడు.

"వాల్తేరు దగ్గరపడుతోందా?"

"ఆc! ..."

"వాల్తేరు నుంచి బస్సేనా గతి?"

"విజయనగరం వెళ్లి వెళ్లొచ్చు ....కాని బస్సు తప్పదు ...."

రమణయ్య ఆలోచనలలోనుంచి తేరుకున్నాడు.

– "మీ నారాయుడు తాత ఎప్పుడూ లేనిది మీకు రాశారంటున్నారు. పెద్దమ్మాయి చిన్న వాళ్లిద్దరినీ చూసుకుంటుంది. నేను వస్తా ... నాకూ టిక్కెట్ బుక్ చెయ్యండి!" అంది శ్రీదేవి ఎంతో తెలివిగా.

ఆమె మాటలు విని ఆమె వంక వింతగా చూశాడు రమణయ్య.

"అవి పసందుగా ఉండవ్! ఆ తరువాత ..."

"తరవాతకూ ముందుకూ ఏముంది? కాకపోతే నేను విశాఖలోనే ఉండిపోతా, మా చెల్లెలు రమ్మని ఎప్పుడూ అడగడమేగాని మనం వెళ్లడం పడనేలేదు. మీరు వస్తూ ఎటూ అక్కడే రైలెక్కాలికాబట్టి నన్ను తీసుకుని వచ్చెయ్యవచ్చు. కాని ముందే చెబుతున్నాను మీకు కావాల్సిన రోజులు ప్లస్ మరో మూడు రోజులు శెలవు పెట్టండి. మా చెల్లెలు ఇంట్లో మీరు విధిగా మూడు రోజులూ ఉండవలసిందే ...." శ్రీదేవి నిష్కర్షగా చెప్పింది. అప్పుడే రమణయ్యకి భార్య పల్లెటూరు తనతో రాదేమోనన్న అనుమానం వేసింది. అయితే కోపం మాత్రం రాలేదు.

"నువ్ మీ చెల్లెలి ఇంటికి వెళతానన్న నీ కోరిక నేను కాదనను. నాకు మాచినతాతయ్యని చూడాలని ఉండడం ఎంత సమంజసమో నీకు నీ చెల్లెల్ని చూడాలని ఉండడమూ అంత సమంజసమే."

– వాల్తేరు ప్లాట్‌ఫారమ్ మీదకు రైలు వెళుతుండగా అడిగింది శ్రీదేవి.

"ఒక్కమాటంటా, కోప్పడరు కదూ!"

"ఆc!" పరాకుగా అన్నాడు.

"ఇప్పటికే పదయిపోయినట్టుంది. ఎండ చూడండి ... మా చెల్లెలి ఇంటికి వెళ్లి పోదాం.... స్నానం, భోజనం అయ్యాక మళ్లీ బస్సు పట్టుకోవచ్చు. వాళ్ల ఇల్లు ద్వారకా నగరే ... దగ్గరే..."

ఇద్దరూ ఆటోలో వచ్చేశారు.

"ఏం రమా?" భార్యాభర్తలిద్దరూ ఒకేసారి పలకరించారు.

"ఎన్నాళ్ళకి చూశానే ... రండి బావగారూ .... మీ తమ్ముడుగారు నిన్ననే పొలంపనులంటూ

పల్లెటూరెళ్లారు...''

'' అయితే ఉద్యోగం చేస్తూ పొలం పనులూ చూసుకుంటున్నారన్నమాట ! అదృష్టవంతులు.. మా భూములు నేను చూసి ఎన్నాళ్లయి పోయిందో...''

''ఏం అదృష్టంలెండి ! వ్యవసాయం మీద మదుపులు కూడా గిట్టుబాటు కావడం లేదు... అయినా వినరు ... ఎవరివెర్రి వారికానందం ... అక్కాపిల్లల్ని తీసుకురాలేదేమో. మా వాళ్లిద్దరూ బళ్లోకిపోయారు. బావగారూ, బాయిలర్లో నీళ్లున్నాయి...''

'' ఇల్లు బావుందే... మీరు స్నానానికెళ్లండి ! నాలినడమనుంది... స్టేషన్ నుంచి ఒకటే రోడ్డు డీసెంట్‌గా ఉంది....''

''నువ్ చిక్కిపోయావక్కా !''

'' ఆయన తొమ్మిదింటికి భోజనం చేసి టిఫిన్ బాక్స్ తీసుకుని వెళ్లిపోతారు.... పిల్లలూ అంతే ! నాకు ఉదయం ఐదు నుంచీ పనే... వాళ్లు వెళ్లాక పదకొండింటికి నేను స్కూలుకెళతా ! బియస్సీ చదివాకదా అని కాన్వెంట్‌స్కూల్లో ఉద్యోగం చేస్తున్నాను... నాలుగింటికి వచ్చేస్తా... జీతం తక్కువేన నుకో. మూడొందలొచ్చినా ఏదో ఓ ఖర్చుకు పనికొస్తుంది... భూములేమిటో ఆస్తులేమిటో మీ బావ గారికి బొత్తిగా తెలియవ్.''

అక్క కబుర్లు వింటూనే పోపుసామానులు తీసి రమణయ్య బాత్‌రూమ్‌లో నుంచి వచ్చేలోగా పొగలు కక్కుతున్న ఉప్మా ప్లేట్‌లో పెట్టేసింది రమ.

''భోజనం చేసి వెళుదురుగాని బావగారూ'' అంటే రమణయ్య భోజనం చేశాక చిన్న కునుకు కూడా తీశాడు.

''పోనీ రేపు వెళ్లవచ్చుగా'' అంది శ్రీదేవి అతను నిద్రలేచాక.

''నీకు రావడం ఇష్టంలేదు... సరే.... చిన తాతయ్యను చూడాల్సింది నేను... నేను బయలుదేరుతున్నా !'' అంటూ రమణయ్య లేచాడు.

''మీ బట్టలు ఒక సూట్‌కేస్‌లో సర్దేశా !'' అంటూ సరదాగా అందించేసింది శ్రీదేవి.

విజయనగరం బస్సు అక్కడ నుంచి పాలెం బస్సూ రెండూ వెంటవెంటనే దొరికాయి.

పాలెం వెళ్లాలంటే కోనేరు దగ్గర బస్ దిగాలి.

ఊళ్లోకి వెళ్లాలంటే సుమారు ఓ గంట నడవాలి...

'' ఓహో ! రంగనాధం గారబ్బాయిలా ఉందే ''

'' ఎక్కడ నుంచి రావడం, హైదరాబాదు నుంచే !''

''బాబూ. పెట్టి పట్టుకుంటా, పదండి !''

''కుసింత టీ చుక్కుంచుకుంటారేటి కోసిడు దూరం నడాల !''

ఇలా తలా ఒకరూ గబగబా పలకరించేస్తుంటే బడలిక నంతటినీ మరచిపోయాడు రమణయ్య.

ఒకతను గ్లాసు అందించాడు. ''టియ్యి తీసుకోండి !''

''నారాయుడు ఉత్తరంవేసినారేటి... ఆరికీ మధ్య ఒళ్లు బాగోకుంది... '' ఓ ముసలాయన అన్నాడు.

''మీరు... నువ్... వీరేశం కదూ !''

గారు అనడమో మానడమో తెలియలేదు రమణయ్యకి. వయసులో చాలా పెద్దవాడే అయినా వీరేశం తమ రైతుల్లో ఒకడు.

''అవును బాఁవూ... పిల్లా జెల్లా కులాసా ?''

'' ఊళ్లోకి వెళుతూ మాటాడుకుందాం...'' పెట్టిచేత్తో పట్టుకున్నాడు ఒకతను.

''మా తాతయ్యకి ఏమిటి సుస్తీ ?''

''సుస్తీ ఏటి బాఁవూ... బతుకే సుస్తీ... సదువుకున్న మడిసి... ఊరి మీద మఁవకారం కొద్దీ ఈడ నే ఉండిపోనాడు... ఆరి అడమనిసి ఎల్లిపోయినకానించి మనిసలగయిపోనాడు... కొడుకులు పని కొచ్చినారు గాదు...''

చెరువు గట్టు మీదనించి వెళితే సుమారు ఒక అరమైలు దూరం తగ్గుతుంది... చెరువు కనబడు తోంది.

''చెరువు బొత్తిగా ఎండిపోయినట్టుంది''

''సెరువేటిబాఁవూ ! మా పల్లెటూరి బతుకులే ఎండిపోతన్నాయి. ఎండేపోనాయ్ !''

రమణయ్యకు ఏమనాలో తోచలేదు.

''మీ అబ్బాయి అప్పలనాయిడు హైస్కూల్లో చదివాడు. ఏం చేస్తున్నాడేమిటి ?''

తొమ్మిదిక్లాసులు సదివి మానీసినాడు... ఆడికి డయివోరు ఉజ్జోగం వచ్చినాది... ఏడాదికోసు ట్టు ఒచ్చి సూసిపోతుంటాడు... ఆడి కిద్దరు మొగపిల్లలు ఒక ఆడదాయి.. బాఁవూ తమకి ?''

– పెట్టిచేతితో పట్టుకున్న మనిషి కనీసం చెయ్యయినా మార్చుకోకపోవడం రమణయ్య గమనిం చాడు.

''నాకు ముగ్గురు''

''సదూకుంటున్నారా ?'' వీరేశం అడిగాడు.

''పెద్దమ్మాయి బియ్యే చదువుతోంది... చిన్నవాడు టెన్త్ చదువుతున్నాడు... చంటిది ఏడో క్లాసు... అవును నాన్నగారుండగా ఈ చెరువుగట్టుంట ఊరికి రోడ్డు వేసి బస్‌రూట్‌లోకి తెస్తామని చెప్పేవా రు...?''

''అందరూ అనుకునీ ఓరే... ఈ ఊరు ఇంతే బాఁవూ .... నారాయుడు సీతకాని పని ఇంకోరి సేత అసలవదు...''

అతనలా అంటూ వుంటే రమణయ్యకి అదోలా అనిపించింది. తండ్రి మెజిస్ట్రేట్ చేస్తూ ఊర్లంటే తిరుగుతూ ఉంటే ట్రాన్స్‌ఫర్ల బాధలేకుండా నారాయుడి తాత దగ్గర ఉండి హైస్కూలుకి కోసెడు దూరం నడిచివెళుతూ తను చదువుకున్నాడు. కడపలో మెజిస్ట్రేట్‌గా పనిచేస్తూ ఆయన అక స్మాత్తుగా చనిపోయారు. తన కాలేజీ చదువంతా విశాఖపట్టణంలోనే జరిగింది. తరువాత విశాఖ నుంచి హైదరాబాదే...

అడపాతడపా రావడమే తప్ప పల్లెతో సంబంధమేమీ లేకుండాపోయింది. ఉమ్మడి ఆస్తి వ్యవహా రాలన్నీ నారాయుడు తాతే చూసుకుంటుండడం ఎవరికేది కావాల్సినా ఆయనే ఇవ్వడం ఆచారం... ఆస్తి, రాబడి, లెక్కలు అడగడం అన్న ప్రసక్తేలేదు. నారాయుడు తాతంటే అందరికీ

గౌరవం అంతకంటే ఎక్కువ భయం. ఎవరివాటా కెంత వస్తుందో లెక్క ప్రకారం వంతులేసి తన దగ్గర దాచుతాడు.... అవసరాన్ని బట్టి వెళ్లి వాళ్లకు అందజేస్తూ ఉంటాడు.

'' ఇదేమిటి ఇక్కడ తాటిపెండి నేను చదువుకుంటున్నప్పుడులేదే...''

'' ఈ దరిమిలా ఏసింది... ఎన్నాళ్లయిందేటి బాఁవూ మీరొచ్చి...''

''పదేళ్లవుతుందేమో...''

తనకంటె ముందుగా కబురెలావెళ్లిందోగాని చినతాతయ్య నారాయుడు లోగిలి ముంగిటే నుం చున్నాడు.

'' ప్రయాణం కులాసాగా అయిందా ?''

'' ఆఁ!''

ఒకతను కాళ్లు కడుక్కోడానికి నీళ్లు తెచ్చి ఇచ్చాడు... తుండుగుడ్డ అందించాడు.

''రా !'' ఆయన అనడమేమిటి ఎక్కడి వాల్లు అక్కడకు వెళ్లిపోయారు.

ఆయన వెనక విశాలమైన సావిడిలోకి వెళ్లాడు రమణయ్య. వాలుకుర్చీలో కూచుని తన మోటా రు సైకిలు వంక చూస్తూ ప్రారంభించారు.

''నీకు కబురుపంపడంలో ఆంతర్యం వుంది. మీనాన్న నాకంటె పదేళ్లు చిన్నవాడు... నేనే ఎత్తు కుని పెంచాను... చదువున్నన్నాళ్లూ చదువు ఆ తరువాత ఉద్యోగం – నేను చివరి చూపుకయినా నోచుకోలేదు... ఇక నా కొడులంటావా ఎవరూ ప్రయోజకులు కాలేదు... తాగి తాగి చచ్చారిద్దరూ... ఆడపిల్లలందరికీ పెళ్లిళ్లు చేశాను... ఎవరి కాపురాలు వాళ్లవి... మనకు ఇవ్వకపోయినా వాళ్లకు మన లక్ష్యంలేదు... ఈ మారుమూలలకు వాళ్లు రారు... రాలేదు... వాళ్ల బంధాలు వాళ్లని రానివ్వవ్... ఎవ రి కాపురాలు వాళ్లవి... అలసటగా ఉందా ?... పాలు తీసుకో... బయలుదేరుదాం...''

ఇద్దరూ లేచారు. ''చాలా రోజులయింది నువ్ ఈ ఇల్లు చూసి... ఇది మన కొత్త ధాన్యం కొట్టు.... వెయ్యి బస్తా వడ్లు పడుతుంది... అయితే ఈ మధ్య ఇది నిండేటట్టు పండించడం లేదను కో. ఇది మన గుర్రం బగ్గీకోసం కట్టించాను.. నా మోటార్ సైకిల్ అదే వాడుతున్నా ఇంకా... నాకు చాలా ఆప్తమిత్రుడది...''

జిగ్గుమని మెరుస్తున్న మోటర్ సైకిల్ గుర్తొచ్చింది రమణయ్యకి.

'తాతయ్యా ! మీరు చిన్నప్పుడు మద్రాసులో –'

''చదువుకున్నాను. ఇంజనీరింగ్ చదివాను... కాని నాకు ఎందుకో ఈ ఊరు వదలాలనిపించలేదు, భూమి బాధ్యతలు వేరే ఎవరూ చూసుకునే వాళ్లు లేకపోవడం. ఇవి మాత్రమే కారణాలు కాదు. మన హోదా ఎవరికొస్తుంది ! మన తృప్తి ఎవరికుంటుంగి ? ఉద్యోగాలని పట్టణాల ఊబిలో ప్రజలు కూరుకుపోతున్నారు. ఉద్యోగంలో నాకు ఏనాడూ నమ్మకం లేదు... నలుగురికి పని ఇవ్వడంలో ఉన్న తృప్తి మనం ఒకరి దగ్గర ఉద్యోగం చెయ్యడంలో లేదు... అందుకే ...''

''చిన్నయ్యా : చిన్నయ్యా :'' ఎవరో ఒకతను రొప్పుకుంటూ వచ్చాడు.

'' ఏమైంది కనకయ్య !''

''బొట్టిడు సెట్టు మీద నుంచి కిందొడిపోనాడు. కాలు ఇరిగినట్టుంది. ఆడి తల్లి...''

''పద నేవస్తున్నా !''

– రెండు వరసల్లో గుడిసెలు. మధ్య నుంచి ఒక యాభై గజాలు నడచి వెళ్లారు నారాయుడూ, రమణయ్యా. ముందు వచ్చిన ఆసామీ వెళుతున్నాడు.

కుర్రవాడి తల్లి లబోదిబోమని ఏడుస్తోంది.

నారాయుడు వంగి బిడ్డడ్ని చూశాడు. ''కాలు కదపకు. నేవెళ్లి మోటార్ సైకిల్ తెస్తా...'' ఆ ఆసామీ బిడ్డను ఎత్తుకోడానికి వంగాడు.

–''బాబూ, బాబూ !'' ఓ ముత్తైదువ పరిగెత్తుకొస్తోంది ఎదురుగా.

''బొట్టికి కానుపు కష్టమైపోతంది. సచ్చిపోతుందేటో... మన మంత్రసాని నోరెళ్లబెడుతోంది.''

''రమణా... నువ్ అబ్బాయి దగ్గరుండు... డాక్టర్నే తీసుకువస్తా... ఎవరినీ ఆ కాలు ముట్టుకోనియ్యకు...''

నారాయుడు భారంగా నడుస్తూ లోగిలివైపు నడిచాడు. కుర్రవాడు మాత్రం ఏదో వింతగా చూస్తున్నాడు... షాక్ వల్లనేమో నొప్పి తెలుస్తున్నట్టులేదు.

ఓ గంటలో డాక్టర్ని వెనక కూచోబెట్టుకుని ముసలాయన వచ్చాడు.

ఓ అరగంట తరువాత గుడిసెలో నుంచి పురిటి కందు ఏడుపు వినబడింది.

మరో అరగంటకి కుర్రవాడి కాలుకి కట్టు కట్టడమూ అయిపోయింది.

''తాతగారూ ! మీరు నర్స్ ట్రెయినింగ్ అయిన వాళ్లకంటే ఎంతో నేర్పుగా చేస్తారు. మాకు సాయం... ఏనాడో అడగాలనుకున్నా ధైర్యం చెయ్యలేకపోయాను... మరేం అనుకోకండి !''

''దానికి ధైర్యం ఎందుకబ్బాయ్ ! జ్ఞానం తెలిసిన దగ్గర నుంచీ ఈ ప్రజల మధ్య ఉంటున్నాను... చేతులతో పని చెయ్యడం నాకు సరదా.''

డాక్టరు చేతులు కడుక్కుంటూ ఉండగా ఓ మరచెంబుతో పాలు తీసుకొచ్చాడు ఒకాయన మరొకాయన అరటిపళ్లు తీసుకొచ్చాడు.

''నారాయుడు తాతగారూ... ఇవన్నీ నా కొద్దు... నేను అవతల చూడాల్సిన కేసులున్నాయి మరి శెలవు ఇప్పిస్తారా ?...''

''వీళ్ల తృప్తి కోసం... నా తృప్తి కోసం కొంచెం తీసుకో... నేను మళ్లీ నిన్ను డ్రాప్ చేస్తా...''

నారాయుడు తాత బొడ్డున దోపుకున్న జాలీసంచి తీసి అందులోనుంచి రెండు వంద కాయితాలు డాక్టరికి అందించాడు.

''మీ దగ్గర నేను తీసుకోను... మందులూ కావలసిన సరంజామా మీరే కొన్నారు... మీ ఊరు రావడం నాకెంతో ఆనందం.''

ఎంత వద్దన్నా వినకుండా తాతయ్య అతని జేబులో నోట్లు నుంచి మళ్లీ ఆయన్ను ఇంటి దగ్గర దిగవిడచి వచ్చాడు.

–రాత్రి భోజనాలయ్యాయి.

పాలమీగడలాంటి వెన్నెల. పచ్చిక బయలులో కూచున్నారు తాతా మనవడూ.

''తాతయ్యా నువే ఆదుకోకపోతే వాళ్లు...''

''వాళ్లు లేకపోతే నేనులేను... కొంచెం దూరమే అయినా నువ్వూ వుండవ్... భూమిదున్ని పండించేది వాళ్లు... నేనూ ఈ ఊరు వదిలేస్తే వాళ్లు ఈ ఊరు వదిలేసేవారు... దాని మాటకేం నీకు

మన ఆస్తులన్నీ చూపిస్తా రేపు... నేను పోయాక...''

''అవేం మాటలు తాతయ్యా''

''నా శరీరంలో శక్తి ఉడిగిపోతోంది... ప్రాణాపాయం కాబట్టి మోటారు సైకిలెక్కాను మళ్లీ చాలా రోజుల తరువాత. మన కుంటుంబం అంటే ఇక్కడ ప్రతి ఒక్కరికీ విపరీతమైన అభిమానం... ప్రేమ... గౌరవం.... ఈ భూములు మనం అమ్ముకోలేం... కొనేవాళ్లెవరూ లేరు.... దూరంనుంచి ఎవరూ వచ్చి కొనే ప్రశ్నలేదు. ఊళ్లో వాళ్లందరు పనిచేసినా మన భూమిని పూర్తిగా సాగుచెయ్యలేం మనం. కారణం ఊరువదలిన వెళ్లిన వాళ్లెవరూ తిరిగిరావడం లేదు... ఎంతో మందిని పట్నం పంపించి నా ఖర్చులతో చదివించాను. బాగా చదువుకున్న వాళ్లు – సరిగ్గా చదువుకోనివాళ్లు ఎవరూ తిరిగిరాలేదు... చిన్నో పెద్దో ఏదో ఉద్యోగంలో స్థిరపడి ఊరు వదిలేశారు. చుట్టపు చూపుకే వస్తారు వచ్చినా... మనం ఈ ఊరు వదిలేస్తే పల్లె నిర్మానుష్యం అయిపోతుంది. యింత మందికి అన్యాయం చెయ్యలేను.,. పంట పండించకుండా బ్రతకలేను. అలా అని భూమిని వీళ్లకు పంచి పెట్టలేను... పంచి పెట్టినా డబ్బు లేకుండా వీళ్లు వ్యవసాయం చెయ్యలేరు... ఇదీ నా సమస్య !''

''తాతయ్యా ! నేను ఈ ఊరు వచ్చేస్తా... నా ఉద్యోగం నా కుటుంబాన్నే పోషించగలదు. ఈ వ్యవసాయం ఊరికీ, మరికొన్ని వేలమందికీ గ్రాసం ఇవ్వగలదు... నేవచ్చేస్తానన్ను నమ్ము.''

''నమ్మాలనేనయ్యా నా ఆదుర్దా... నువ్ ఈ ఊరు నిలబెట్టాలి. ఎంత ఖర్చన్నది కాదు. ఎంత లాభమన్నది కాదు. ఎంత పండించగలిగామన్నది ప్రశ్న. డబ్బుతో సమస్యలు తీరిపోవు. బియ్యపు గింజ వందరూపాయలిచ్చి కొనాలన్నా ముందు దొరకాలి కదా !,,, పల్లెలు నిర్మానుష్యం అయిపోతే దేశం వెన్నెముక విరుగుతుందయ్యా !''

''వచ్చేస్తా తాతయ్యా ! పిల్లలు ఎలాగో చదువుకుంటారు. అబ్బాయిని దేవుడు మేలు చేస్తే డాక్టరీ చదివిస్తా...''

రమణయ్య మాటల్లోని ఉత్సాహం తాతయ్య కళ్లల్లోకి నీళ్లు రప్పించింది.

''రా నాయనా పడుకుందాం పొద్దు పోయింది.''

వారం రోజులూ గడిచిపోయాయి. ఆస్థి వివరాలన్నీ రమణయ్యకి తెలిసిపోయాయి. తోటలూ, భూములూ ఏవి ఎక్కడ ఎలా ఉన్నాయో వివరంగా అతనికి చూపించాడు నారాయుడు.

''ఇదిగో నా డయరీ... నా తదనంతరం శ్రద్ధగా చదవాల్సిన పుస్తకం... నా వీలునామా కూడా ఇందులోనే ఉంచుతా !... ఈమారు శ్రీదేవిని తీసుకురా...'' అంటూ తాతయ్య బస్సు వరకూ రమణయ్యని దిగబెట్టాడు.

–'' ఇన్నాళ్లకు జ్ఞాపకం వచ్చానన్న మాట'' మొదటి వాక్యంలోనే దెప్పిపొడవడం ప్రారంభించింది శ్రీదేవి.

''పద వెళదాం... రేపే డ్యూటీలో చేరాలి''

''అదేం కుదరదు.. మీరూ మా చెల్లెలింట్లో మూడు రోజులుండాల్సిందే!''

''బాగుంది... మరి పిల్లల సంగతి ?''

శ్రీదేవి మెత్తబడక తప్పలేదు.

రమణయ్యకి తన మనసులో ఆలోచనని భార్యకి చెప్పడానికి అనువైన సమయం కోసం

చూస్తున్నాడు.

ఇల్లు చేరారు.

" ఎనభై ఎకరాల పొలం... ఇరవై ఎకరాల మామిడితోటలు.. పది ఎకరాల కొబ్బరితోట–" తమ ఆస్తులన్నింటినీ వర్ణించాడు ఒక అరగంట.

"తాతయ్య ఆస్తిని మనకి వప్పచెప్పేస్తానంటున్నాడు..."

"మరి వాళ్లవాళ్లో?"

"అవన్నీ ఆయన చూసుకుంటాడు. నేను వెళ్లకపోతే ఆ ఊరు నాశనమైపోతుంది... ఇరవై అయిదేళ్ల సర్వీసయిపోయింది. పింఛన్ ఇవ్వమంటే సంతోషంగా ఇచ్చేస్తారు... మనం ఇద్దరం పోయి అక్కడ రాజుల్లా..."

"బావుంది మీ ఆలోచన... పల్లెటూర్లో బ్రతుకా?... ఆ రోజులు పోయాయి... మీరెన్ని చెప్పండి, నేను రాను... పిల్లలకి చదువులుండవ్! రోగంవస్తే ఆస్పత్రి వుండదు. ఏది కావాల్సినా మూడుమైళ్లు నడచి బస్సు ఎక్కి ఇరవై మైళ్లు పట్నం పోవాలి నాకొద్దు... నా పిల్లలకీ వద్దు...ఇదన్నమాట ఆయన మీకు తలకెక్కించిన మందు. ఈ నిర్వాకం చాలు కాని మనకదేం వద్దు..." ఠక్కున తెంపేసింది శ్రీదేవి.

రమణయ్య మారు మాటాడలేదు.

మరుసటిరోజు పెద్దమ్మాయితో చెప్పాడు. పల్లె గురించీ, ఆస్తి గురించీ.

"మనకి ఆస్తి వస్తోందిగా... ఎంచక్కా కారుకొనుక్కుందాం!"

"నాకు స్కూటరుంటే ఎంతో సుఖం..." చిన్నవాడు.

"మీకు అన్నీ కొనిస్తా! కాని నాతో మీరు అమ్మను పంపించెయ్యండి."

"అమ్మ మాతోనే వుంటుంది.... అదేదో అమ్మేసి..." ఏడో క్లాసు చదువుతున్న పిల్ల అంది హఠాత్తుగా.

చటుక్కున లేచి ఆ పసిదాన్ని ఛెళ్లున ఓ లెంపకాయ కొట్టాడు రమణయ్య. అతని ఉద్రేకం ఆ పసిదానికి బోధపడలేదు. తల్లికీ అర్థం కాలేదు.

హైదరాబాదు నుంచి వెళ్లిన రమణయ్య మాత్రం వెనక్కితిరిగి రాలేదు. అతన్ని తాతయ్య పిలిచాడు. కాదు. ఊరే పిలిచింది.

**స్వాతి సపరివారపత్రిక**

30. 8.1985